సాక్షి కర్నూలు

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



డీఎస్సీ స్పోర్ట్స్‌కోటాలో అక్రమాలు!

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఎమ్మిగనూరు ఇందిరానగర్‌కు చెందిన గొల్ల రామాంజనేయులు ఆదివారం విలేకరులకు ఈ విషయాన్ని చెప్పారు. 8లో▸



శాస్త్రోక్తంగా పల్లకీసేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి షోడశోపచారపూజలు చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.32
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 77.542
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 61,681
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 69,775

న్యూస్‌రీల్

పెచ్చులూడి పడిన పాఠశాల పైకప్పు

- విద్యార్థులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం



పాఠశాల పైకప్పు పెచ్చులూడిన పడిన దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు కొట్టాల గ్రామంలో ప్రాథమిక పాఠశాల పై కప్పు పెచ్చులూడి పడి పోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో అందులో విద్యార్థులు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల చాతా కాలం క్రితం కట్టించడంతో మరమ్మతులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల పైకప్పు ఉబ్బిపోయి శిథిలావస్థకు చేరింది. ఆదివారం ఓ మోస్తరు వర్షం కురుస్తుండడంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో పైకప్పు పెచ్చులూడి కిందకు పడిపోయింది. గ్రామస్తులు గమనించి పాఠశాలకు వెళ్లి చూస్తే తరగతి అంతటా చెల్లాచెదురుగా పెంకులు ఊడిపడ్డాయి. పాఠశాల లేక పోవడంతో పిల్లలకు ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు స్పందించి పాఠశాలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరారు.

ఆగస్టులో అధిక వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఆగస్టు నెల అధిక వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు అపారనష్టం వాటిల్లింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ. ఉండగా 208.9 మి.మీ. (80 శాతం అధికం) నమోదైంది. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఆదోని, క్రిష్ణగిరి, వెల్దుర్తి తదితర మండలాల్లో అధిక వర్షాలు కురిశాయి. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 10 మండలాల్లో వర్షాలు కురిశాయి. కల్లూరులో 12.8 మి.మీ., కర్నూలు అర్బన్‌లో 11.8, మంత్రాలయంలో 11.4, కోసిగిలో 11.2, కర్నూలు రూరల్‌లో 11.2, కౌతాళంలో 6.4 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తుల శివ నామ స్మరణతో శ్రీశైల ఆలయం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పుర వీధులు కిటకిటలాడుతున్నాయి.

పొలాల్లో చిరుతపులి కూన సంచారం

డోన్ టౌన్: పంట పొలాల్లో చిరుతపులి కూన సంచరిస్తూ ఉండటం దొరపల్లె, సీసంగుంతల గ్రామస్తులను భయాందోళనలకు గురి చేసింది. ఆదివారం పొలం పనులకు వెళ్లిన వారు చిరుత కూనను చూసి వీడియో తీశారు. చిరుత పిల్లతో పాటు తల్లి చిరుత ఉంటుందని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు బీట్ అధికారిణి భారతి దొరపల్లె, సీసంగుంతల గ్రామాలకు వెళ్లారు. చిరుత పులి కూన సంచారం విషయం తెలుసుకొని ప్రజలను అప్రమత్తం చేస్తూ దండోరా వేయించారు. పొలాలకు ఒంటరిగా వెళ్లకూడదని, నలుగురు అంతే కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో రూ. 23 లక్షల మోసం

కర్నూలు(సెంట్రల్): ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ గుర్తు తెలియని మోసగాళ్ల ఉచ్చుకు జోహరాపురం కుర్రాడు బలయ్యాడు. ఏకంగా రూ.23.70 లక్షలు పెట్టుబడి మోసం పోయాడు. కర్నూలు అర్బన్ మండల పరిధిలోని జోహరాపురానికి చెందిన శ్రావణ్‌కుమార్ అధిక వడ్డీలకు ఆశపడి ఆన్‌లైన్‌లో రూ.23.70 లక్షలు పెట్టబడి పెట్టారు. సైబర్ మోసగాళ్ల సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో మోసపోయానని తెలుసుకొని ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీలు మొదటికొచ్చి.. ఈ-క్రాప్ అటకెక్కి!

విధి నిర్వహణలో అంటీముట్టనట్లుగా వీపీఏలు

- స్థానాలను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు
- ఈసారి జేసీ ఆధ్వర్యంలో బదిలీలకు అవకాశం
- జిల్లాలో ముందుకు సాగని ఈ-క్రాప్ నమోదు
- ఇప్పటి వరకు 3.6 శాతమే పూర్తి
- 'అన్నదాత సుఖీభవ' గ్రీవెన్స్ పట్టించుకునే నాథుడే కరువు



ఆదోని మండలం జి.హొస్సలిలో మూతపడిన ఆర్‌బీకే

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ వ్యవసాయ సహాయకుల(వీపీఏ) బదిలీల వ్యవహారం మళ్లీ మొదటికి రావడంతో వ్యవసాయ శాఖలో ప్రతిష్టంబన నెలకొంది. హైకోర్టు ఆదేశాలతో రీ కౌన్సెలింగ్ అనివార్యమైంది. ఈనేపథ్యంలో కోర్టుకు వెళ్లిన వారు మినహా మిగిలిన వీపీఏలు ఇప్పటికే కొత్త స్థానాల్లో చేరిపోయారు. బదిలీల్లో చాలా మంది వీపీఏలు పెద్ద ఎత్తున ముడుపులు ఇచ్చుకొని కీలకమైన స్థానాలు దక్కించుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వీరు డబ్బు ఎలా సంపాదించుకోవాలనే విషయంపైనే దృష్టి సారిస్తూ.. విధి నిర్వహణ గాలికొదిలేసినట్లు తెలుస్తోంది. రీ కౌన్సెలింగ్ విషయమై వ్యవసాయ శాఖ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయని పరిస్థితి. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు వీపీఏల బదిలీలు అనివార్యమైతే జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఉన్నట్లు తెలుస్తోంది. వీపీఏల బదిలీల వ్యవహారంలో జిల్లా పరువు గంగలో కలవడం పట్ల వ్యవసాయ శాఖపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. మరోసారి విమర్శలకు తావు లేకుండా జేసీకి వీపీఏల బదిలీల బాధ్యత అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే మండల వ్యవసాయాధికారులుగా నియమితులైన వారిలో 90 శాతం మంది కూటమి పార్టీల నేతలకు ముడుపులు ఇచ్చుకొనే వచ్చారనే చర్చ ఉంది. కనిష్టంగా రూ.5 లక్షల నుంచి గరిష్టంగా రూ.30 లక్షల వరకు ముడుపులు ఇచ్చుకున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టుకొని స్థానాలు పొందిన వారందరూ ఇప్పుడు ఆ మొత్తాన్ని సంపాదించుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితి పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

ముందుకు సాగని ఈ-క్రాప్ బుకింగ్

ఖరీఫ్ సీజన్ మరో 40 రోజుల్లో ముగియనున్నా ఈ-క్రాప్ బుకింగ్ ముందుకు సాగని పరిస్థితి. ఇప్పటి వరకు జిల్లాలో 3.38 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. మామూలుగా అయితే ఇప్పటికే 50–60 శాతం వరకు ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి కావాల్సి ఉంది. అయితే 3.6 శాతం మాత్రమే చేయడం గమనార్హం. సగం మండలాల్లో ఈ-క్రాప్ బుకింగ్ ఊసే కరువైంది. బదిలీలు మళ్లీ మొదటికి రావడంతో పోస్టింగ్ ఎక్కడికి పడుతుందోనన్న ఆందోళన వీపీఏల్లో వ్యక్తమవుతోంది.

అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ తీసుకునేదెవరు?

అన్నదాత సుఖీభవ కింద వేలాది మందికి అన్ని అర్హతలున్నా సాయం అందలేదు. బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ కాని ఖాతాలు వేలల్లో ఉన్నాయి. ఈ లిస్ట్‌లను గ్రామ రైతు సేవా కేంద్రాలకు పంపారు. వివరాలు రైతులకు చెప్పేందుకు వీపీఏలు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో రైతుల నుంచి అన్నదాత సుఖీభవకు సంబంధించి గ్రీవెన్స్ తీసుకునే వారు కరువయ్యారు. తీసుకున్న గ్రీవెన్స్‌ను పరిశీలించి పరిష్కరించే దిక్కు లేకుండా పోయింది.

నిర్వీర్యమైన రైతు సేవా కేంద్రాలు

అన్నదాతలకు విశేష సేవలందించిన రైతుభరోసా కేంద్రాలు నేడు ఉండీ లేనట్లుగా తయారయ్యాయి. గతంలో 877 రైతు భరోసా కేంద్రాలు ఉండగా.. కూటమి ప్రభుత్వం 689కి తగ్గించింది. రేషనలైజేషన్ పేరిట 188 రైతు సేవా కేంద్రాలను మూసివేసింది. ఎట్టకేలకు బదిలీల ప్రక్రియ పూర్తయి పాలన గాడిన పడుతోందని భావిస్తున్న తరుణంలో హైకోర్టు వీపీఏల బదిలీలను రద్దు చేసింది. మళ్లీ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడంతో వ్యవసాయ శాఖలో ప్రతిష్టంభన నెలకొంది.

ఈ-క్రాప్ నమోదు చేస్తారో, లేదో!



ఈ సారి పత్తి, కంది తదితర పంటలు సాగు చేశాం. గతంలో ఆగస్టు 15లోపే ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేసేవాళ్లు. ఈ సారి ఆగస్టు నెల గడుస్తున్నా ఆ ఊసే కరువైంది. ఇక్కడ పనిచేసే గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌ను బదిలీ చేశారు. ఆ స్థానంలో ఎవ్వరినీ నియమించలేదు. 2023–24 వరకు రైతులకు అన్ని రకాల సేవలు ఆర్‌బీకే ద్వారా అందాయి. ఇప్పుడు ఎలాంటి సేవలు అందించడం లేదు. ఈ-క్రాప్ నమోదు చేస్తారో లేదో కూడా తెలియని పరిస్థితి.

– ఉమేష్, జి.హొసల్లి, ఆదోని మండలం

మీరూ కోర్టుకు వెళ్లండి

- ➡ కోర్టుకు వెళ్లిన 40 మంది కోసం అందరినీ బదిలీ చేయాలా.. మీరూ కోర్టుకు వెళ్లండి.. అని కొంతమంది అధికారులు వీపీఏలను రెచ్చగొడుతున్నట్లు సమాచారం.
- ➡ హైకోర్టు ఆదేశాల మేరకు రీకౌన్సెలింగ్ అనివార్యం కావడంతో ముడుపులు, సిఫారసులతో అనుకూలమైన స్థానాలు దక్కించుకున్న వీపీఏలు తమ పరిస్థితి ఏంటని నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- ➡ దాదాపు 100 మందికిపైగా వీపీఏలు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ముడుపులు ఇచ్చుకొని స్థానాలు పొందారు.
- ➡ ఒక వీపీఏ కోరుకున్న స్థానం కోసం రూ.2 లక్షలు ముడుపులు ఇచ్చుకున్నట్లు తెలుస్తోంది.
- ➡ స్థానాలు మారితే ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని కోరుతున్నట్లు చర్చ జరుగుతోంది.
- ➡ ఈ నేపథ్యంలో 40 మంది కోసం అందరినీ బదిలీ చేయడం ఏంటి, మీరు కూడా కోర్టుకు వెళ్లండని రెచ్చగొడుతున్నట్లు తెలుస్తోంది.
- ➡ రేషనలైజేషన్ వల్ల నంద్యాల నుంచి 40 మంది వీపీఏలు కర్నూలు జిల్లాకు రావడం తప్పనిసరి.
- ➡ కోర్టుకు వెళ్లిన 40 మందికి వేరే పోస్టింగ్ ఇచ్చినా.. మరో 40 మంది పశ్చిమ ప్రాంతంలోని సరిహద్దు మండలాలకు వెళ్లడం తప్పనిసరి.

క్వింటా ఉల్లి రూ.1,200 ప్రకారం కొనుగోలు చేయాలి

- టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



రైతులతో మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా ఉల్లిని రూ.1,200 ప్రకారం కొనుగోలు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మార్కెటింగ్, హార్టికల్చర్, మార్క్‌ఫెడ్, మార్కెట్ యార్డు సెక్రటరీలతో ఉల్లి కొనుగోలుపై ఆదివారం ఉదయం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదివారం మార్కెట్లకు వచ్చిన ఉల్లి నిల్వలు, సోమవారం ఎన్ని క్వింటాలు వచ్చే అవకాశం ఉందన్న వివరాలను తెలుసుకున్నారు. సోమవారం 1,200 నుంచి 1,500 క్వింటాళ్లు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని సెక్రటరీ వివరించారు. ఆదివారం నుంచే మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని క్వింటా రూ.1200 ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి మార్కెట్లలో ఉల్లిని ఆరబెట్టుకునేందుకు తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజనేయులు, మార్క్‌ఫెడ్ డీఎం రాజు, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, కర్నూలు మార్కెట్ సెక్రటరీ జయలక్ష్మి పాల్గొన్నారు.

కర్నూలు, పత్తికొండలలో ఉల్లి కొనుగోలు

కర్నూలు, పత్తికొండ మార్కెట్ యార్డుల్లో రైతుల నుంచి కిలో రూ.12 ప్రకారం ప్రభుత్వమే ఉల్లిని కొనుగోలు చేయనున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు. ఆదివారం రాత్రి ఆమె కర్నూలు మార్కెట్ యార్డును సందర్శించారు. అక్కడ ఇద్దరు రైతులతో మాట్లాడారు. క్వింటా రూ.1200 ప్రకారం ప్రభుత్వమే ఉల్లిని కొనుగోలు చేస్తుందని చెప్పడంతో వారు అంగీకరించారు. అయితే నాణ్యత ప్రమాణాల మేరకు గ్రేడింగ్ చేసుకోవాలని సూచించారు. జేసీ వెంట మార్కెట్ సెక్రటరీ జయలక్ష్మీ, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, మార్క్‌ఫెడ్ డీడీ గద్వాల్ నాగరాజు పాల్గొన్నారు.

పీఆర్ క్యూసీ డీఈఈగా భాస్కరరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌వీ భాస్కరరెడ్డి

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం డివిజన్ -1 ఇన్‌చార్జ్ (పూర్తి అదనపు బాధ్యతలు) డీఈఈగా ఎస్‌వీ భాస్కరరెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు రెగ్యులర్ డీఈఈగా విధులు నిర్వహించిన వీ.రవీంద్రారెడ్డి ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలోనే కార్యాలయంలోనే అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న భాస్కరరెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోఆదివారం స్థానిక జెడ్పీలోని క్యూసీ కార్యాలయంలో డీఈఈగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏఈఈ అమర్‌నాథ్, కార్యాలయ సీనియర్ సహాయకులు బీ.గిడ్డమూర్తి పాల్గొన్నారు.



భక్తజనం మధ్య ఆదోని పట్టణంలో శోభాయాత్ర



తుంగభద్ర దిగువ కాలువలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

శోభాయమానం.. నిమజ్జనోత్సవం

గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఆదోని పట్టణంలో ఆదివారం శోభాయమానంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన 400కు పైగా వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు నిమజ్జనోత్సవం ప్రారంభమైంది. విగ్రహాలన్నీ ఒకేచోటుకు చేరుకోవడంతో ఆదోని పాత బస్టాండు కూడలి భక్తజనసంద్రంగా మారింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మేళతాళాలు, డోలు శబ్దాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక ఆనందంతో మైమరిచి నృత్యం చేశారు. బాణసంచాలు పెద్ద ఎత్తున పేల్చారు. సోమవారం తెల్లవారు జాము వరకు తుంగభద్ర దిగువ కాలువలో నిమజ్జనోత్సవం సాగింది.

– ఆదోని అర్బన్



మనిషి మరణించాక దేహం నశించిపోతుంది. నశించి పోక ముందే కొన్ని అవయవాలు తీసుకుంటే మరొకరికి జీవితం ఇవ్వవచ్చు. కంటిలోని కార్నియాను సేకరించి వేరొకరికి అమరిస్తే ఇద్దరికి దృష్టిని ప్రసాదించవచ్చు. ఒక విధంగా మరణించాక కూడా ఆ వ్యక్తి ఈ అందమైన ప్రపంచాన్ని తన కళ్లతో చూస్తున్నాడన్న మాట. కానీ కొందరు నేత్రదానం చేస్తే మరుజన్మలో కళ్లులేని వారుగా జన్మిస్తారన్న మూఢనమ్మకంతో ఈ కార్యక్రమానికి ముందుకు రావడం లేదు. ఇలాంటి వారికి అవగాహన కల్పించేందుకు ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. – కర్నూలు(హాస్పిటల్)

నేత్రం.. దానం.. అమరం

- నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు...!
- ఒకప్పుడు హైదరాబాదులో కార్నియా మార్పిడి
- ఇప్పుడు కర్నూలులోనే సదుపాయం
- రెండు ప్రైవేటు ఆసుపత్రుల్లో అమలు
- ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో మీనమేషాలు
- 8వ తేదీ వరకు జాతీయ నేత్రదానం పక్షోత్సవాలు



ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి

నేత్రదానం ఒక పుణ్యకార్యం. నేత్రదానమంటే చాలా మందికి బతికుండగానే కళ్లు తీసుకుంటారనే అభిప్రాయం ఉంది. మరణించిన మనిషి నుంచి మాత్రమే నేత్రాలను సేకరిస్తారనే నమ్మకం ఇప్పుడు అవగాహన కలుగుతోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు, అధికారులు నేత్రదానంపై చేస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల దీనికి ప్రజలు ముందుకు వస్తున్నారు. కానీ ఈ నేత్రదానం చేసే వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు కర్నూలులో ఉన్న ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా అధికారులు, టెక్నీషియన్లు సైతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా, ఎవ్వరైనా మరణించిన తర్వాత ఆరు గంటల్లోపు వారికి సమీపంలోని కంటి సేకరణ కేంద్రం/ఐ బ్యాంక్‌కు సమాచారం ఇస్తే సిబ్బంది వచ్చి కంటిలోని కార్నియా(నల్లగుడ్డు)ను మాత్రమే సేకరిస్తారు. అనంతరం వారికి కృత్రిమ నేత్రాలను అమర్చడం వల్ల ఎలాంటి అవయవ లోపం కనిపించదు. ఇలా సేకరించిన వాటిని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపిస్తున్నారు. అక్కడ నేత్రాలు అవసరమైన వారికి వీటిని అమర్చి చూపును ప్రసాదిస్తున్నారు. ఇప్పుడు కొంత కాలంగా కర్నూలులోనే కార్నియా మార్పిడి ఆపరేషన్లు అమీలియో, సుశీల నేత్రాలయ ఆసుపత్రుల్లో నిర్వహిస్తున్నారు. ప్రాంతీయ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు మాత్రమే నిర్వహిస్తున్నారు. అయితే కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన శిక్షణ పొందేందుకు అక్కడి వైద్యులు ముందుకు రావడం లేదు. దీంతో ఇక్కడ కార్నియా మార్పిడి ఇంకా ప్రారంభం కావడం లేదు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు.

కార్నియాను ఇలా సేకరిస్తారు...

నేత్రదానం చేసే వారి కుటుంబసభ్యులకు ఎలాంటి చార్జీలు (ఫీజు) ఉండవు. ఈ నేత్రాలను ఉచితంగా వైద్యుల బృందం వెళ్లి వారి దగ్గరనే సేకరిస్తారు. ఈ నేత్రాలను వారి ఇళ్ల వద్ద కూడా సేకరిస్తారు. సేకరించిన నేత్రాలను రిజిస్టర్‌లోని వెయిటింగ్ లిస్ట్ ప్రకారం ఇతరులకు అమరుస్తారు. ఒక వ్యక్తి వద్ద సేకరించిన రెండు కళ్లను ఇద్దరు వ్యక్తులకు అమరుస్తారు. దీనివల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించినట్లు అవుతుంది. మత గురువులు సైతం ప్రపంచమంతా నేత్రాదానాన్ని ప్రోత్సహిస్తున్నారు. వ్యక్తి మరణించిన ఆరు గంటలోపు నేత్రాలను తీయాల్సి ఉంటుంది. నేత్రదానానికి ఎవ్వరైనా అర్హులు. అయితే రేబిస్, హెచ్ఐవీ/ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధితో చనిపోయిన వారి నేత్రదానానికి పనికిరావు.

జిల్లాలో నేత్రదానం చేసిన వారి సంఖ్య

సంవత్సరం	నేత్రదానాల సంఖ్య
2015-2016	175
2016-2017	373
2017-2018	368
2018-2019	349
2019-2020	377
2020-2021	176
2021-2022	264
2022-2023	412
2023-2024	488
2024-2025	352



నేత్రదానం పుణ్యకార్యక్రమం



నేత్రదానం చేయడం పుణ్యకార్యక్రమంతో సమానం. ప్రపంచంలో 4 నుంచి 6 శాతం మంది కార్నియా జబ్బుతో బాధపడుతున్నారు. ఇందులో 0.36శాతం భారతీయులే ఉన్నారు. దీనిని ఈ ఏడాది చివరి నాటికి 0.25శాతానికి తీసుకురావాలన్నది ప్రభుత్వ సంకల్పం. దేశంలో ఏటా 47,676 మంది నుంచి కార్నియా సేకరిస్తున్నారు. వాటిలో 29,057 వినియోగిస్తున్నారు. మిగిలినవి వివిధ కారణాల వల్ల నిరుపయోగమవుతున్నాయి. నేత్రదానం సమయంలో మొత్తం కన్ను గాకుండా నల్లగుడ్డు (కార్నియా) మాత్రమే తీస్తారు. దాని స్థానంలో కృత్రిమ కళ్లను మరణించిన వారికి అవయవలోపం కనిపించదు. దాతలు ఇచ్చిన నేత్రాలను విక్రయించడం, కొనడం జరగదు. ఇతరులకు ఉచితంగా అమరుస్తారు.

– డాక్టర్ పి. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి, కర్నూలు

క్లుప్తంగా

స్వరూప్ సిన్హాకు పురస్కారం


అవార్డు స్వీకరిస్తున్న స్వరూప్ సిన్హా

కర్నూలు కల్చరల్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిడుగు జయంతి, తెలుగు భాషా వేడుకలలో కర్నూలు మోషన్ కళాశాల అధ్యాపకులు ప్రముఖ కవి, రచయిత డాక్టర్ బీవీ స్వరూప్ సిన్హాకు గిడుగు రామ్మూర్తి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ గ్లోబల్ నెట్వర్క్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్, ఫౌండేషన్ అధ్యక్షురాలు, గిడుగు రామ్మూర్తి మునిమనుమరాలు గిడుగు కాంతి కృష్ణ, కార్యదర్శి కళా రత్న డాక్టర్ బిక్కి కృష్ణ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. సిన్హా కథా సంపుటి 'నాతో స్నేహం చెయ్యవూ'కు పురస్కారం ప్రదానం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


మృతుడు నాగిరెడ్డి (ఫైల్)

ఆళ్లగడ్డ: పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగిరెడ్డి (62) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి పట్టణ శివారులోని ఓ గోడౌన్లో వాచ్మెన్గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం గోడౌన్ నుంచి పట్టణంలోకి నడుచుకుంటూ వస్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న క్రేన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా ఢీ కొట్టాడు. ప్రమాదంలో నాగిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నంద్యాల: నంద్యాల పట్టణ శివారులోని రైతు నగరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త తెలిపారు. ట్రాఫిక్ సీఐ తెలిపిన మేరకు ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడని, మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. మృతుడి వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సార్బీసీ బ్లాక్ - 1 గేటుకు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాణ్యం: గోరుకల్లు రిజర్వాయర్ వద్ద ఎస్సార్బీసీ బ్లాక్-1 గేటుకు మరమ్మతులు చేపట్టారు.. గేటు గడ్డర్ పూర్తిగా వంగిపోవడంతో గేటు నిర్వహణ కష్టంగా మారింది. దీంతో ముందుగా ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలకు అధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గించి మరమ్మతులు చేశారు. ఈ బ్లాక్ కింద 16,853 ఎకరాలు సాగు అవుతుందని ఈఈ కిష్టన్న తెలిపారు. తాత్కాలికంగా పనులు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. ప్రధాన కాల్వలకు యథావిధిగా నీటిని విడుదల చేసినట్లు ఈఈ తెలిపారు. ప్రతి బ్లాక్ ద్వారా నీరు చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

బై బై గణేశా!


డోన్ సమీపంలో వెంకటాపురం చెరువు వద్ద నిమజ్జన సందడి


కర్నూలులో.. బండిపై తీసుకొస్తూ..


గణేశుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తురాలు


ఆళ్లగడ్డ: ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన


వెంకటాపురం చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


ఆదోని: భారీ విగ్రహాన్ని ఊరేగింపుగా తరలిస్తున్న భక్తజనం

'దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. నీ అండాదండా ఉండాలయ్యా'.. అంటూ బొజ్జ గణపయ్యకు ఘన వీడ్కోలు పలికారు. వినాయక చవితి సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొలువుంచిన గణేశుడి ప్రతిమలను ఐదో రోజు ఆదివారం నిమజ్జనం చేశారు. ఆదోని, కర్నూలు, నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నిమజ్జన శోభా యాత్ర చేపట్టారు. భక్త జనం ఉత్సాహంగా నృత్యాలు చేస్తుండగా.. ఓ వైపు బాణా సంచా పేలుళ్లు.. మరో వైపు డప్పుల హోరు.. ఇంకోవైపు డీజేల ధ్వనులు హోరెత్తాయి. చెరువులు, నీటి కాల్వల్లో విగ్రహాలను నిమజ్జనం చేసి 'వినాయకా.. వెళ్లిరావయ్యా' అంటూ వీడ్కోలు పలికారు. – సాక్షి నెట్వర్క్


కర్నూలు: ఎద్దుల బండిపై నిమజ్జనానికి


కర్నూలు: వినాయక ఘాట్ వద్ద నిమజ్జనోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


ఆదోనిలో పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


కోవెలకుంట్ల: ఊరేగింపులో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన


నంద్యాల: యువత కేరింత


నందికొట్కూరు: ఊరేగింపులో ఎగిసిన భక్తి కెరటం


డోన్: యువత కోలాహలం


ఆదోని: నృత్యం చేస్తున్న మహిళలు

27 ఏళ్ల తర్వాత సొంతూరుకు..

- బాలుడిగా వెళ్లి భార్యాబిడ్డలతో తిరిగి వచ్చాడు..


భార్యా పిల్లలతో లక్ష్మన్న

ఆదోని రూరల్: తల్లిదండ్రులు దూరమయ్యారు.. ఆ బాలుడిని పట్టించుకునే దిక్కు లేదు. కాలే కడుపు చేత పట్టుకుని ఆ 13 ఏళ్ల పిల్లోడు రైలెక్కాడు. ఎవరూ తెలియని ఊరిలో దిగి బతుకుదెరువు కోసం చిన్న చితకా పని చేసుకుంటూ పెద్దయ్యాడు. అక్కడే పెళ్లి చేసుకుని భార్యా పిల్లలతో జీవిస్తుండగా అనుకోని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో సొంతూరుపై మమకారం పెరిగింది. 27 ఏళ్ల తర్వాత అతను తిరిగి వచ్చాడు. వివరాల్లోకి వెళితే.. ఆదోని మండలం దిబ్బనకల్ గ్రామానికి చెందిన పెద్దరంగన్న, నాగలక్ష్మి దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కొంత కాలానికి ఆ దంపతులు మృతి చెందగా ఆ పిల్లలను ఆదరించే వారు కరువయ్యారు. రెండో కుమారుడైన లక్ష్మన్న 13 ఏళ్ల వయస్సులో దిబ్బనకల్ గ్రామం నుంచి నడుచుకుంటూ ఆదోని రైల్వేస్టేషన్కు చేరుకున్నాడు. రెండు రోజులు అక్కడే ప్రయాణికులు ఇచ్చే వాటితో కడుపు నింపుకున్నాడు. ఏమి చేయాలో తెలియక ఓ రైలెక్కగా అది పంజాబ్కు చేరుకుంది. అక్కడ లక్ష్మన్న చిన్న వయస్సులో నానా ఇబ్బందులు పడ్డాడు. బతకడానికి మెకానిక్ షెడ్లో పనిచేసుకుంటూ, లారీ క్లీనర్గా పనిచేశాడు. ఆ తర్వాత లారీ డ్రైవర్ అయ్యాడు. ఈ క్రమంలో హర్యానా రాష్ట్రానికి చెందిన అనాథ అయిన రీనాను పెళ్లి చేసుకున్నాడు. వారికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కలిగారు. లారీ డ్రైవర్గా పనిచేస్తూ లక్ష్మన్న కుటుంబాన్ని పోషిస్తుండగా ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు. తన భార్య, పిల్లలను దృష్టిలో పెట్టుకుని డ్రైవర్ వృత్తి వద్దనుకుని సొంత గ్రామమైన ఆదోని మండలం దిబ్బనకల్ గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. ఇందులో భాగంగా ఐదు రోజుల క్రితం భార్య రీనా, పిల్లలతో కలిసి గ్రామానికి చేరుకున్నాడు. అయితే ఊరిలో లక్ష్మన్నను ఎవరూ గుర్తు పట్టలేదు. పంజాబీ భాష మాట్లాడుతుండడంతో ఎవరికీ అర్థంగాక అనుమానించారు. తల్లిదండ్రుల పేర్లు చెప్పి ఆధార్కార్డులో తండ్రి పేరును చూపించడంతో తన బంధువులు గుర్తించారు. ఎప్పుడో చిన్నప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడని, తమ వాడేనని గ్రామస్తులకు వివరించారు. సొంత అన్న హైదరాబాద్కు, ఇద్దరు తమ్ముళ్లు బెంగళూరుకు వలస వెళ్లారు. ప్రస్తుతానికి లక్ష్మన్న చిన్న తమ్ముడు ఇంట్లో నివాసముంటున్నాడు. తన పిల్లలను కుటుంబానికి, బంధువులకు దగ్గర చేయాలని, సొంత వాళ్లతో కలసి బతకాలని నిర్ణయించుకుని సొంతూరుకు తిరిగి వచ్చానని లక్ష్మన్న చెబుతున్నాడు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు!

- డిస్ట్రిక్ స్పోర్ట్స్ అధికారులే అన్యాయం చేశారని ఆరోపణ
- మరో వ్యక్తికి తన సర్టిఫికెట్ ఇచ్చారన్న రామాంజినేయులు

ఎమ్మిగనూరుటౌన్: అధికారుల తప్పిదం, అవినీతితో డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఈ విషయాన్ని ఎమ్మిగనూరు ఇందిరానగర్కు చెందిన గొల్ల రామాంజినేయులు ఆదివారం విలేకరులకు తెలిపారు. తాను 2017 నుంచి 2019 వరకు ప్రొద్దుటూరులోని రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో చదివినట్లు చెప్పారు. అలాగే పూణెలో జరిగిన జాతీయస్థాయి 6 కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో 19వ స్థానం దక్కించుకున్నట్లు చెప్పారు. జాతీయ స్పోర్ట్స్ సర్టిఫికెట్ను 2016లోనే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సెక్రటరీకి పంపారన్నారు. తాను డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద పీడీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అయితే స్పోర్ట్ అథారిటీ అధికారుల నుంచి తన పేరుతో ఉన్న జి.రామాంజినేయులు అనే వ్యక్తి సర్టిఫికెట్ అక్రమంగా పొంది డీఎస్సీలో పీడీ పోస్టుకు ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి సర్టిఫికెట్ లేకపోవడంతో తనను ఇవ్వాలని జి.రామాంజినేయులు సంప్రదించడంతో ఈ బాగోతం బయటపడిందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్కు ఈనెల 25న స్పందనలో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు.

కొణిదేడులో క్షుద్రపూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామంలో ఒక వ్యక్తి ఇంటి వద్ద తొమ్మిది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి ఆవరణలోకి వచ్చి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, మట్టితో చేసిన బొమ్మలపై పసుపు, కుంకుమ పోసి క్షుద్ర పూజలకు పాల్పడుతున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు పరిశీలించి వెళ్లారు.

మట్టి మనిషికి తోడుగా...

బంగారు పంట పండించాలనే లక్ష్యంతో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతుకు కొంగలు తోడుగా నిలిచాయి. ఆత్మకూరు మండలంలోని సిద్ధేశ్వరం సమీపంలో ఓ రైతు ట్రాక్టర్తో పొలాన్ని వరి నాటుకు తయారు చేస్తూ కనిపించారు. మట్టి మనిషికి తోడుగా కొంగలు నిలిచి చీడ పురుగులను ఏరివేశాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



మోటారు సైకిల్ను ఢీకొట్టిన కారు

- భార్య మృతి..భర్తకు తీవ్ర గాయాలు


అరుణమ్మ (ఫైల్)

కోడుమూరు రూరల్/సి.బెళగల్: కె.నాగలాపురం పోలీస్స్టేషన్ పరిధిలోని పెద్దపాడు వద్ద మోటారు సైకిల్ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందారు. ఈ దుర్ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సి.బెళగల్ మండలం పోలకల్కు చెందిన వెంకటేశ్వరరెడ్డి, భార్య అరుణమ్మ(50)తో కలిసి బైక్పై కర్నూలు వెళుతుండగా, ఇదే సమయంలో కర్నూలు నుంచి పెద్దపాడు వైపు వస్తున్న కారు శ్రీరామ వెంచర్ వద్ద ఢీకొట్టింది. ప్రమాదంలో మహిళ అరుణమ్మ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వెంకటేశ్వరరెడ్డిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో సోమేశ్వర గ్రామైఖ్య సంఘానికి దాదాపు పదేళ్లుగా అరుణమ్మ వీఓఏగా పనిచేస్తున్నారు. అరుణమ్మ మృతి విషయం తెలుసుకున్న మండల వెలుగు ఏపీఎం రామేశ్వర్, పలు గ్రామాల వీఓఏలు కర్నూలు ఆసుపత్రికి చేరుకుని సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఐటీబీపీ కానిస్టేబుల్కు కన్నీటి వీడ్కోలు


నరేంద్రనాథ్ (ఫైల్),


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీబీపీ పోలీసులు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఐటీబీపీ(జీడీ) కానిస్టేబుల్ జగదల నరేంద్రనాథ్ (32) మృతదేహాన్ని ఆదివారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖ పట్నం జిల్లా ఆనందపురం మండలం, పందలపాకలోని 56 బెటాలియన్ ఐటీబీపీ(జీడీ) కానిస్టేబుల్గా పని చేస్తూ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామైన ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చేరుకోవడంతో ఐటీబీపీ పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నివాళులర్పించారు. అనంతరం ఐటీబీపీ పోలీసుల లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గత కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన సూర్యనారాయణ, లక్ష్మి దంపతుల కుమారుడు నరేంద్రనాథ్ 2014లో ఐటీబీపీ కానిస్టేబుల్గా ఎంపికయ్యాడు. మృతుడికి భార్య స్వాతితో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.